# శత్రువు

- ఇందూరమణ

ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్.

హైదరాబాద్‌లో బయలుదేరుతుంది ఉదయాన్నే. ట్రైన్ కదులుతున్న తరుణంలో అదృష్టంకొద్దీ ప్లాట్‌ఫారం మీద అడుగు పెట్టాను. రిజర్వేషన్ సంగతటుంచి కదులుతున్న రైలు ఎక్క గలిగితేనే నా గమ్యం నేను అనుకున్న సమయానికి చేరగలను.

మరిక, అటూ ఇటూ ఎటూ ఆలోచించకుండా పరుగు పరుగున వెళ్ళి కంపార్ట్‌మెంట్‌లోకి దూకాను.

లక్కీ. అది జనరల్ బోగీ. ఖాళీగా ఉంది. హాయిగా కూర్చున్నాను.

హైదరాబాద్ పరిసరాలు దాటుతోంది రైలు.

కిటికీ దగ్గర కూర్చున్నా నేమో గాలి మత్తుగా తగుల్తోంది. మనసు హాయిగా నెమలి పింఛంలా కదులుతోంది.

భువనేశ్వర్‌లో పనుంది. ఆరేడేళ్ళ క్రితం హైదరాబాద్ నుంచి వెళ్ళి భువనేశ్వర్‌లో స్థిరపడ్డాడు మా మేనమామ. మా కుటుంబం హైదరాబాద్‌లోనే స్థిరపడింది. నేను ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాను. నా కేదో పెళ్ళి సంబంధం ఉందని మా మావయ్య ఉత్తరం రాయడంతో నాన్న బలవంతం మీద నేను భువనేశ్వర్ బయలుదేరవలసి వచ్చింది.

భువనేశ్వర్ వెళ్ళే సరికి ఎంత టైం పడుతుందో? విశాఖపట్నం వెళ్ళే సరికి రాత్రి తొమ్మిది కావచ్చు. ఎంత లేదన్నా భువనేశ్వర్ వెళ్ళేసరికి తెల్లారి పోవచ్చు. అదీ ఒకందుకు మంచిదే.

ఆలోచిస్తూ పుస్తకం తెరిచాను. నవల చదివి మూసే సరికి ట్రైన్ విజయవాడ చేరింది. అప్పటికే కంపార్ట్‌మెంట్ రద్దీగా అయిపోయింది.

భోజనం చెయ్యబుద్ధికాక అరటి పళ్ళు తీనుకున్నాను.

నా ఎదురుగా కొత్త జంట కూర్చుంది. ఒకటే గుసగుసలు, పక పకలు.

తదేకంగా చూస్తే బావుండదని దృష్టి మరల్చాను. నా పక్కన ఎవరో మహానుభావుడు వీరసుత్తి వేస్తున్నాడు.

రాజకీయం, చిత్రసీమ, లోకం పోకడ, మోసాలు, బోఫోర్సు, ఫెయిర్‌ఫాక్స్, శ్రీలంక ఒకటేమిటీ? ప్రపంచం గురించీ, ప్రపంచ సమస్యల గురించీ లెక్చర్ ఇస్తున్నాడు.

అన్యమనస్కంగానే అది వింటూ తల వాల్చాను.

ఎవరో తట్టి లేపినట్టూ ... మిన్ను విరిగి వెన్ను మీద పడ్డట్టూ ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను.

హాయిగా చెవుల్లో ఫైరింజన్‌లా మోగిన కంఠం ఒక్కసారి మూగబోయేసరికి చటుక్కున లేచి కూర్చున్నాను.

ఆ మహానుభావుడు ఎప్పుడు దిగిపోయాడో. రైలు ఏదో స్టేషన్‌లో ఆగి ఉంది.

ప్లాట్‌ఫారం వైపు పరిశీలనగా చూశాను. రాజమండ్రి.

రాజమండ్రి బోర్డు చూసే సరికి నా స్మృతి పథాన్ని పదేళ్ళ నాటి జ్ఞాపకం వరదలా ముంచేసింది.

పదేళ్ళ నాటి పాత జ్ఞాపకం ఇప్పటికీ కళ్ళ ముందు కదులుతూనే ఉంది.

రాజమండ్రిలో ఆరు నెలల కాలంలో అరవై ఏళ్ళకు కూడా మాసిపోని గుర్తులు. ఆరు యుగాలు గడిచినా మరపురాని చేదు అనుభవాలు.

** ** ** **

"నమస్తే!"

మేడమెట్లు దిగుతుంటే ఎదురుగా వచ్చి అంది ఆ అమ్మాయి. ఆ అమ్మాయి వెనుకే పది మంది అమ్మాయి లున్నారు.

"నమస్తే!" చిన్నగా నవ్వి అన్నాను.

"నేనూ మీకే ఓటు వేశాను. మీరు మన ఇన్‌స్టిట్యూట్ స్టూడెంట్ యూనియన్‌కి సెక్రటరీగా ఎన్నిక కావడం మా అందరికీ సంతోషం!"

"థేంక్స్!" అన్నాను.

నేను కో-ఆపరేటివ్ ట్రైనింగ్‌కి ఆ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి నెలే అయింది. ఆర్నెల్లు ట్రైనింగ్. నా కెవరూ సరిగ్గా తెలియదు.

మా ఇన్‌స్టిట్యూట్‌లో ఆరు సెక్షన్‌లు ఉన్నాయి. సెక్షన్‌కి ఏభై మంది స్టూడెంట్లు. నేను 'సి' సెక్షన్. ఆ అమ్మాయిలందరూ 'ఏ' సెక్షన్‌లో ఉన్నారు. అయితే, ఆరు సెక్షన్‌లకీ ఆరుగురు రిప్రజెంటి వ్‌లుంటారు కదా - ఆ అమ్మాయి ఏ సెక్షన్‌కి లీడరట.

సెక్రటరీని ఆ ఆరుగురిలో ఒకర్ని మిగతా అయిదుగురూ ఎన్నుకోవాలి.

నాకు పోటీగా అమలాపురం అబ్బాయి నిలబడ్డాడు. అయితే నాకు నాలుగు ఓట్లు పడ్డాయి. ఆ అబ్బాయికి రెండు ఓట్లు. పడి ఓడిపోయాడు. అస్సలు నేను గెలవ ననుకున్నాను. ఆ అమ్మాయి ఓటు నాకు పడకూడదు.

తూర్పు గోదావరి జిల్లా వాళ్ళంతా ఆ అబ్బాయికి మద్దతు ప్రకటించారు. రిప్రజెంటివ్‌ల్లో నలుగురు ఆ ప్రాంతం వాళ్ళే. నేను గెలవడమే నాకు ఆశ్చర్యం. మేడ మీద స్టూడెంట్సందరి ముందూ ప్రమాణం చేసి దిగుతున్నాను. నా వెనుక మా మిత్ర బృందం ఉంది.

ఈ అమ్మాయి ఎదురయి అభినందనలు తెలిపింది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఆ అమ్మాయి నాకు ఓటు వేయడానికి కారణం? అభిమానంతో నాకు ఎదురొచ్చి అభినందన తెలుపటానికి నాలో గొప్పతనం ఏముంది?

కలత నిద్రతో అటూ ఇటూ రాత్రంతా గడిపాను.

మర్నాడు - తొందరగానే ఇన్‌స్టిట్యూట్‌కి బయలుదేరాను. ఆ అమ్మాయి కూడా వేగంగానే వచ్చింది. పలకరింపుగా నవ్వింది. నేనూ నవ్వాను.

ఆ వారం రోజులూ నాకు రాత్రులు కలతగానే ఉండేది. ఆ అమ్మాయి మనసు నా మీద పడింది. నా మనసులోనూ ఆమె రూపం పదిలమౌతోంది. ఎలా నా మనసు విప్పి ఆమె ముందు పరవడం?

ఆ రాత్రి మా రూమ్మేట్ పడుకుంటూ అన్నాడు: "సావిత్రి అస్తమానం నీ గురించే అడుగుతోందిరా? నువ్వు బాగా చదువుతావా అని అడిగింది?"

"ఏం చెప్పావ్?" ఆత్రంగా అడిగాను.

"చదువుతావనే చెప్పాను. నీ దస్తూరీ అమోఘం అని కూడా చెప్పాను."

"నిజంగానా?"

"నిజమే! అలా చెప్పడం వలన నీ రికార్డ్ బుక్ తెమ్మని రిక్వెస్టు చేసిందిరా!" రాజు అన్నాడు.

రాజు ఆమెతో పాటే 'ఏ' సెక్షన్‌లోనే ఉన్నాడు. అందుకే - నా గురించి వాడితో స్నేహం పెంచుకొని ఉంటుంది. రాజుకి నే నంటే ఎనలేని అభిమానం.

నేను సెక్రటరీగా ఎన్నిక కావటానికి నాకు కుడి భుజంగా పనిచేసింది రాజే. నాకు నమ్మిన బంటు.

ఆమె నన్ను పొగడడం, నా రికార్డు తెమ్మని రిక్వెస్ట్ చేయడం నా గుండెల్లో పెను తుపానుకు కారణ మయ్యాయి.

రెండు రోజుల్లో రాత్రీ పగలూ కష్టపడి రికార్డు పూర్తి చేసి వాడితో పంపాను.

ఓ రోజు నేను ఇన్‌స్టిట్యూట్ నుంచి రూమ్‌కి వస్తున్నాను. వెనుక నుంచి రాజు కేక వేశాడు. ఆగి వెనక్కి తిరిగాను.

సావిత్రి జోరుగా నడుస్తూ నా దగ్గరకు వచ్చింది. ఆమెతో పాటే రాజు కూడా ఉన్నాడు. ఆమె నా రికార్డు తీసి ఇచ్చింది.

"నే నింకా మీ రూమ్‌కి వచ్చి ఇది ఇవ్వాలనుకున్నాను" అంది ఓరగా నా కేసి చూస్తూ.

"రండి! దీని కోసమే రావాలా? ఊరికే రాకూడదా?" అన్నాను.

అలాగే పదండి" అంటూ ఆ రోజు పిలవకుండానే మా రూమ్ కొచ్చింది సావిత్రి.



సాయంత్రం వరకూ మాతో పాటే గడిపింది.

సాయంత్రం చీకటి కావడంతో సావిత్రిని వదిలి రమ్మని రాజుని పంపాను. నేను ఆమెతో వెళ్తే ఎవరైనా చూస్తే అనుమానిస్తారని భయపడి వెళ్ళలేదు. పాపం! ఆ రోజు నా మాట కాదనలేక వెళ్ళాడు.

ఆ తర్వాత సావిత్రి రోజూ క్రమం తప్పకుండా మా రూమ్ కొచ్చి గంటో ... అరగంటో ఉండి వెళ్ళిపోయేది.

ఒక రోజు నేను కమిటీ మీటింగ్ ఉందని ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళాను. రాజు రా ననేశాడు.

నేను ట్రైనింగ్ సెంటర్‌కి వెళ్ళే సరికి అందరూ చర్చల్లో ఉన్నారు. ఆలస్యానికి క్షమాపణలు చెప్పి కూర్చున్నాను.

అప్పటికే సావిత్రి వచ్చి చాలా సే పయినట్టుంది. నేను వెళ్ళి వెళ్ళగానే ఇంట్లో పనుందంటూ లేచి నిలబడింది సావిత్రి. మినిట్ బుక్‌లో సంతకం చేయించాను. నా కేసి చూసి నవ్వి 'వస్తా'నంటూ వెళ్ళిపోయింది.

ఆ రోజు మీటింగ్ అయ్యే సరికి చాలా రాత్రయింది. మధ్యాహ్నం భోజనాలు కూడా అక్కడికే తెప్పించాము.

మీటింగ్ కాగానే నేను రూమ్ కెళ్ళాను. మా ప్రాంతమంత కరెంట్ పోయినట్టుంది. చుట్టూ కటిక చీకటి. నెమ్మదిగా... అంచనా మీద తడుముకుంటూ వెళ్ళాను.

తలుపులు దగ్గరగా వేసున్నాయి. లోపల కొవ్వొత్తి వెలుగుతోంది.

రాజు ఏం చేస్తున్నాడో?

తలుపులు నెట్టబోయి ఆగాను.

లోపల ఏదో గుస గుసలు.

ఆశ్చర్యపడ్డాను. తలుపు సందులో నుంచి లోపలికి దృష్టి సారించాను. ఆ దృశ్యం చూసి అదిరిపడ్డాను.

నా నవనాడులూ క్రుంగిపోయాయి. అచేతనంగా గోడకు జేరగిలబడ్డాను. లీలగా లోపలి మాటలు వినిపిస్తున్నాయి.

"మా వాడు మంచి రొమాంటిక్ మూడ్‌లో ఉన్నాడు. ను వ్వంటే పడి చస్తున్నాడు. పాపం! వాడికి మన విషయం తెలీదు." రాజు గొంతు.

"నేను కూడా అతనితో అభిమానంగా మాట్లాడుతున్నా కదా! అది అతని మీద ప్రేమ అనుకుంటున్నాడు." సావిత్రి గొంతు.

"ఒక వేళ మన సెక్రెటరీ ఇలా మనల్ని చూస్తే ఫీలవుత డంటావా?" రాజు అన్నాడు.

"ఎలా ఫీలవుతే మన కేం? నిన్ను కలవడానికి ఆయన రూమ్‌కి రానిస్తాడో, రానివ్వడో అని నువ్వు భయపడ్డావ్! కానీ, మన ప్లానే సక్సెస్ అయింది" అంటూ పక పక నవ్వింది ఆమె.

"నీ తెలివి అమోఘం సావిత్రీ!"

వాళ్ళ మాటలు వినేసరికి నా మెదడు మొద్దు బారిపోయింది. నిజంగా తా నెంత పిచ్చివాడు. వాళ్ళ నైజం... వాళ్ళ మోసం.... వాళ్ళ ప్రవర్తన అసలు తను అనుమానించనే లేదు.

వాళ్ళ గుస గుసలు వింటూ అక్కడ గడపడం నా వల్ల కాలేదు. గిర్రున వెనక్కి తిరిగి లేడ్స్ మీదకు వచ్చాను. సావిత్రి వెళ్ళే వరకు ఉండి ఆ తర్వాత రూమ్‌కి వెళ్ళాను.

ఆ మర్నాడే రాజుతో తెగతెంపులు చేసుకొని వేరేగా నేను ఒక్కడినే రూమ్ తీసుకున్నాను. మిగతా కాలం ఎలాగో గడిపి ట్రైనింగ్ కోర్స్ పూర్తి చేశాను.

ఆ తర్వాత - రాజూ, సావిత్రి పెళ్ళి చేసుకున్నారని కొందరూ, రాజు సావిత్రికి హేండిచ్చాడని కొందరూ, సావిత్రి రాజుని మోసం చేసిందని మరికొంతరు ఏవేవో పుకార్లు!

ఏ మాట నమ్మగలం? ఎవర్ని నమ్మగలం? నమ్మి ఓ సారి మోసపోయిన నేను మరోసారి ఎలా దగా పడగలను?

పదేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి.

** ** **

రైలు కూతకి ఉలిక్కి పడి ఇవాల్టి కొచ్చాను.

ఆ సరికే రాజమండ్రి స్టేషన్ వదిలి ముందుకు పరుగులు తీస్తోంది రైలు.

సావిత్రి గుర్తొచ్చే సరికి గుండెల్లో చిన్న సవ్వడి!

ఆమెని ఎంతగా అభిమానించాడు తను!

ఆమెని ఎంతగా ఆరాధించాడు తను!

ఎలా దగా చేసింది? ఎంత క్రూరంగా మోసం చేసింది? రాజో? రాజు కూడా ఎలా నయవంచన చేశాడు? రాజు ఎంత నమ్మక ద్రోహి!

"నమస్తే!"

ఎవరో నన్నే పలుకరించే సరికి ఉలిక్కి పడ్డాను.

ఎవరో ఆంటీ. పలకరింపుగా నవ్వుతూ నా ఎదురుగా వచ్చి కూర్చొంది.

ఆ నవ్వు? ఉలిక్కిపడ్డాను.

"మీరు అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగే ఉన్నారు. ఏ మాత్రం మార్పు రాలేదు" ఆమె అంది.

నేను కళ్ళు నులుముకున్నానే గాని ఆమె ఎవరో గుర్తించలేక పోయాను.

"నేను గుర్తున్నానా సార్?" ఆమె తిరిగి అంది.

నా మెదడు ఏనాడో మొద్దుబారి పోయింది. ఆమెని ఎలా గుర్తించను?

" నే నండీ! మీ స్నేహితురాల్ని. మీతో పాటు ఆర్నెల్లు కలిసి చదివిన దాన్ని. ఇంకా గుర్తుకు రాలేదా?" ఆమె నిష్ఠూరంగా అంది.

"ఓ! మీరా?" అన్నాను.

ఎలా అయిపోయింది! సన్నగా... నాజూగ్గా అందంగా ఉండే అమ్మాయి లావుగా ఆంటీలా ఎలా తయారయింది!

"పిల్లలు....?" సంశయంగా అన్నాను.

"లేరు?" అంది బాధగా తల దించుకుంటూ. ఆమెలో అప్పటికీ, ఇప్పటికీ చెదిరిపోనిది ఒక్కటే. మొహంలో పసితనం. గొంతులో అమాయకత్వం.

ఆమెను చూసిన దగ్గర్నుంచి నా మదిని ఒక ప్రశ్న దొలుస్తూనే ఉంది. అడగడమా, మానడమా? చివరికి నా మనసే జయించింది.

"అరుంధతీ! నా దో ప్రశ్న!"

"అడగండి!"

"సావిత్రి....?"

"ఇప్పుడు నేను వెళ్తున్నది దాని దగ్గరకే!" ఆనందంగా అంది అరుంధతి.

"ఆమెకి పిల్లలున్నారా?"

"పిల్లలా, పాడా? ప్రస్తుతానికి ఎవరూ లేరు."

"రాజు ఎలా ఉన్నాడు?"

"ఇద్దరూ మన పరీక్షలు కాకముందే విడిపోయారు."

"ఎలా?" నాలో ఎందుకో ఆత్రుత.

"రాజు ఓ రోజు తొందర పడబోయాడట. సావిత్రి ఎదురు తిరిగింది. ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగి పరిచయం మిగిలిపోయింది" అంటూ వ్యంగ్యంగా నవ్వింది అరుంధతి.

నేను మౌనంగానే విన్నాను. నేను ఏమని కామెంట్ చేయగలను?

మళ్ళా - అరుంధతే అంది "రాజుకు పెళ్ళయిందనీ, పిల్లలు కూడా ఉన్నారనీ మీతో ఏనాడన్నా చెప్పాడా?" ప్రశ్నించింది అరుంధతి.

"లే...లే...లేదు. పెళ్ళయిందా?"

"పిల్లలతో అతని భార్య ఒక రోజు మన ఇన్స్టిట్యూట్‌కే వచ్చింది. ఆదివారం కావటం వల్ల మన కెవరికీ తెలీలేదు. అటెండర్ గౌస్‌ని కలిసిందట. రాజు రూమ్ అడ్రస్ చెప్పి ఆమెని పంపేశాడట. గౌస్ సావిత్రిని పిలిచి ఆ విషయం చెప్పి గడ్డి పెట్టాడట."

"పాపం." నొచ్చుకున్నాను.

"దానికి ఆ శాస్తి జరగవల్సిందే మాధవ్. జరగాల్సిందే! నీలాంటి మంచి వ్యక్తిని మోసం చేసి వాళ్ళు ఏం బాగుపడ్డారు?" అంది బాధగా.

"నువ్వెంత వరకూ?" మాట మారుస్తూ అన్నాను.

"భువనేశ్వర్"

"నేనూ అక్కడికే!" అన్నాను.

"ఏదైనా పనిమీద వెళ్తున్నారా?" అడిగింది అరుంధతి.

"ఆఁ!... ఆఁ!.. పనే! అఫీషియల్ వర్క్" అన్నాను.

"సావిత్రిని చూడ్డానికి వెళ్తున్నాను" అంది.

"సావిత్రీ వాళ్ళు భువనేశ్వర్‌లో ఉంటున్నారా?"

"వాళ్ళ నాన్న గార్కి ట్రాన్స్ఫర్ అయి మొన్నీమధ్యే వెళ్ళారు."

"అడ్రస్ ఇవ్వు! వీలయితే వచ్చి కలుస్తాను" అన్నాను.

సావిత్రిని ఓ సారి ... ఒకే ఒక్క సారి చూడాలన్న కోరిక. అందుకే ఆ మాట జారాను.

అరుంధతి అడ్రస్ ఇచ్చింది.

ఇంతలో విశాఖపట్నం వచ్చింది.

ఇద్దరం భోజనాలు కానిచ్చేసి కూర్చున్నాం. రాత్రయిందేమో. మాకు తెలియకుండానే ఇద్దరం కునుకు తీశాం. మగత నిద్ర నుండి మేల్కొనకముందే భువనేశ్వర్‌లో దిగాం.

నా మానాన నేను ఆటో ఎక్కాను. మా మావయ్యా ఉండే ఏరియా రైల్వే స్టేషన్‌కు చాలా దూరం.

అరుంధతి రిక్షా ఎక్కింది. సావిత్రి వాళ్ళూ ఉండేది ఆ పక్కనేనట.

అప్పటికి సరిగ్గా రాత్రి రెండవుతోంది.

నేను ఇంటికి వెళ్ళే సరికి మా మావయ్యా వాళ్ళు గాఢ నిద్రలో ఉన్నారు. నేను వెళ్ళాక అస్సలు ఎవరూ పడుకోలేదు.

మావయ్యా అత్తయ్యా కలసి నేను చూడబోయే అమ్మాయి గురించే, ఆమె అందచందాల గురించే, వాళ్ళ కుటుంబం గురించే తెగ పొడిగేస్తున్నాడు.

నా కళ్ళలో... గుండెల్లో సావిత్రి రూపం కదలాడుతోంది. ఎంత వేగంగా తెల్లారుతుందా! ఎంత వేగంగా ఈ పెళ్ళి చూపుల తతంగం పూర్తవుతుందా అన్న ఆత్రుత.

పెళ్ళి చూపుల కార్యక్రమం కాగానే అట్నుంచి అటే సావిత్రి వాళ్ళ ఇంటికి వెళ్ళి సావిత్రిని చూడాలన్న ఆత్రత.

తెల్లారింది మావయ్యా, అత్తయ్యా, నేనూ బయలుదేరాం. ముగ్గురం ఆటో ఎక్కాం.

నా మనసు నిండా సావిత్రే నిండిపోయింది. ఇప్పుడు తను ఎలా ఉంటుందో? ఆమె భర్త ఏం చేస్తున్నాడో?

పిల్లలు లేరని అంది అరుంధతి. బహుశా లావుగా తయారయి ఉంటుందా? ఏమో.

"పిల్ల చాలా లక్షణంగా ఉంటుందిరా." అత్త అంది.

"అవును! చాలా చాలా బావుండేది!" అన్నాను.

"ఏవిట్రా మాధవ్, ఏవిట్రా?" మావయ్యా భుజం చరిచాడు.

నేను సిగ్గుతో తల దించుకున్నాను. నా మన సెందు కివాళ ఇలా సావిత్రి కోసం పరితపిస్తోంది. రాజు సావిత్రిని మోసం చేసినందుకు ఆనందమా? వాళ్ళిద్దరూ విడిపోవడంతో తిరిగి తనకి ఆమె మీద ప్రేమ జనించిందా?

ఏమో!

రైల్వే స్టేషన్ దగ్గరకి వచ్చింది ఆటో.

మావయ్యా ఆటోవాడికి అడ్రస్ చెప్పాడు. పక్క వీధిలోకి వెళ్ళి ఓ ఇంటి ముందు ఆటో ఆగింది. పెళ్ళి వాళ్ళు ఎదురొచ్చారు.

అరుంధతి. వాళ్ళలో అరుంధతి అగుపించింది.

నేను షా కయ్యాను. నేను పెళ్ళి చూపుల కోసం వచ్చింది సావిత్రి ఇంటికా? ఆటోలో నన్ను చూసి అరుంధతికి నోట మాట రాలేదు. అచేతనంగా ఉండిపోయింది.

సావిత్రికి పెళ్ళయింది. మరి, పెళ్ళి కూతురు ఎవరు? సావిత్రికి చెల్లి ఉందా? ఏమో!

మేం మౌనంగా లోపలకు వెళ్ళాం.

సావిత్రి అమ్మ నాన్నలు మాకు రాచమర్యాదలు చేశారు.

అరుంధతి అమ్మాయిని తీసుకు వచ్చింది.

అమ్మాయి ఎలా ఉందో గాని - చీర మాత్రం చాలా బాగుంది. అమ్మాయి తెల్లగానే ఉంది. నాజూక్కా ఉంది. జడ కోడెత్రాచులా పొడవుగా ఉంది.

మా ముందర చాప మీద కూర్చోబెట్టారు.

"కొంచెం తల పైకెత్తమ్మా!" అత్త అంది.

అరుంధతే ఆ అమ్మాయి గడ్డం క్రింద చెయ్యేసి. ఎత్తింది.

అదిరి పడ్డాను.

నే నా కళ్లను మరిచిపోలేను. నా కా మొహం బాగా పరిచయం.

సావిత్రి... సావిత్రి.... సావిత్రి...?

అవును సావిత్రే!

సావిత్రి చెల్లెలు కూడా అచ్చం అక్కలాగే ఉంటుందా?

ఏమో!

కానీ, నా గుండెల్లో ఆమె సావిత్రే అయి ఉంటుందన్న గట్టి నమ్మకం.

"నీ పేరేంటమ్మ!" మావయ్యా అడిగాడు.

"సావిత్రి." ఆమె చెప్పింది.

నా చెవులు చిల్లులు పడ్డాయి. నా గుండె అదిరింది. నా మెదడు మొద్దుబారి పోయింది.

సావిత్రికి ఇంకా తన లాగే పెళ్ళి కాలేదా?!

ఆ రోజు - రాజుతో సావిత్రి నవ్వుతూ అన్న మాటలు గుర్తొచ్చాయి. నవ్వు .... ఆ నవ్వు నా చెవుల్లో ప్రతిధ్వనించింది.

చటుక్కున లేచి నిలబడ్డాను.

మా అత్తయ్యా, మావయ్యా అదిరి పడ్డారు. అవాక్కయ్యారు.

"పదండి పోదాం!" అంతే అన్నాను.

వెనక్కి చూడకుండా ఆ ఇంట్లో నుంచి బయటపడ్డాను.

"బావున్నారా మాధవ్?" గేటు దగ్గర ఎదురొచ్చి అంది ఆమె.

ఆమెని చూసి నెత్తి మీద పిడుగు పడ్డట్టూ అదిరిపడ్డాను. "సావిత్రీ, నువ్వా?"

"అవును!" నవ్వుతూ అంది.

"మరి.. మరి లోపల...?! "సంశయంగా అన్నాను.

"మా చెల్లి, అచ్చం నాలాగే ఉంటుంది. మీరు ఆటోలో దిగ్గానే అరుంధతి చెప్పింది. అప్పుడే మీ సంబంధం నేను ఇష్టపడలేదు.

సావిత్రి మాటలు వినే సరికి నా గొంతులో తడారి పోయింది.

"మీరు ఒక వేళ మా చెల్లిని పెళ్ళి చేసుకున్నా అనుక్షణం మీ కళ్ళముందు మెదిలే నన్ను చూస్తూ మీరు ఆనందంగా గడపలేరు. నేనూ, నా భర్తా సుఖంగా ఉన్నా మీరు చూసి తట్టు కోలేరు. మా చెల్లిని కూడా సుఖపెట్టలేరు.

అందుకే నేను కావాలనే మా చెల్లితో నా పేరు చెప్పించాను. నా మీద మీకు ప్రేమ ఉండొచ్చు. కానీ, మీరు సాహసించి నన్ను పెళ్ళాడ్డానికి ముందుకు రారని నాకు తెలుసు. మీ పెళ్ళికి శుభలేఖ పంపండి. నేనూ, మా వారూ తప్పక వస్తాం." సావిత్రి చర చర లోపలకు వెళ్ళిపోయింది.

అప్పటికీ ఇప్పటికీ ఆమెలో ఎలాంటి మార్పు లేదు.

అరుంధతి లోపల నుంచి నవ్వుతూ చెయ్యి ఊపింది.

అ..రుం...ధ....తి!

మనసులోనే సణుక్కున్నాను.

కోపమో... అసహ్యమో... అసహనమో... ఏమో!

★